# నేడే.. ఓట్ల లెక్కింపు

- సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి
- ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు



ఓట్ల లెక్కింపు జరుగనున్న సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాల


ఓట్ల లెక్కింపు సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 2 : శాసనసభకు జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపు ఆదివారం సీవీఆర్ కళాశాలలో జరుపనున్నారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల ఓట్ల లెక్కింపుకోసం అధికారులు సీవీఆర్ కళాశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో పాటు అబ్జర్వర్లు జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే సీవీఆర్ కళాశాలలో స్ట్రాంగ్‌రూంలల్లో ఈవీఎంలను భద్రపర్చి కేంద్ర బలగాల పర్యవేక్షణలో ఉంచారు. ఆదివారం ఓట్ల లెక్కింపు చేపట్టడం కోసం ఆయా నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపునకు ప్రత్యేక టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఇబ్రహీంపట్నం అసెంబ్లీ ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కోసం వచ్చే రాజకీయ పార్టీల ఏజెంట్ల కోసం టేబుళ్ల సమీపంలో జాలీలతో ఏర్పాటు చేసిన గ్యాలరీలను సిద్ధం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 3,27,583 కాగా, 2,45,105 ఓట్లు పోలయ్యాయి. పోలైన ఓట్లను రౌండ్లవారీగా విభజించి కౌంటింగ్ చేయనున్నారు. ఎన్నికల పరిశీలకుల సమక్షంలో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఓట్ల లెక్కింపు కోసం కేటాయించిన సిబ్బందికి శనివారం సీవీఆర్ కళాశాలలో శిక్షణ నిర్వహించారు. శిక్షణ పొందినవారిచేత ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలను ఓపెన్ చేయనున్నారు.

**కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి**
**- రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ అనంతరెడ్డి**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. ఓట్ల లెక్కింపుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలను తెరిచి ఓట్ల లెక్కింపు చేపడుతామన్నారవు. సాయంత్రం వరకు తుది ఫలితం వస్తుందని ఆయన తెలిపారు.

## 1.93 లక్షల ఓట్లు.. 22 రౌండ్లు

- చేవెళ్లలో ఎన్నికల బరిలో 12 మంది అభ్యర్థులు
- గెలుపుపై ధీమాతో ఉన్న బీఆర్ఎస్



హిమాయత్‌సాగర్‌లోని లార్డ్స్ కళాశాల

షాబాద్, డిసెంబర్ 2 : చేవెళ్ల నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చేవెళ్ల డివిజన్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం తెలిపారు. 30వ తేదీన జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి చేవెళ్ల డివిజన్‌లోని ఐదు మండలాల్లో 298 పోలింగ్ కేంద్రాల్లో 2.62 లక్షల మంది ఓటర్లు ఉండగా 1.93 లక్షల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 73.82 శాతం పోలింగ్ నమోదైనట్లు చెప్పారు. నియోజకవర్గంలో మొత్తం 2086 మంది ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఒటు హక్కును వినియోగించుకున్నారు.

**ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి..**

చేవెళ్ల నియోజకవర్గానికి సంబంధించిన అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓట్ల లెక్కింపుకోసం ఆదివారం రాజేంద్రనగర్ పరిధిలోని హిమాయత్ సాగర్ లార్డ్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మొత్తం 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు, 22 రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియ ముగించడం జరుగుందన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో మొత్తం 150 మంది సిబ్బంది పాల్గొంటున్నట్లు చెప్పారు. ఒక్కో అభ్యర్థి తరపున 20 మంది ఏజెంట్లకు అనుమతి ఉందన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా ముందుగా ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తారని, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ పూర్తయిన తర్వాత 8:30 గంటల నుంచి ఈవీఎంల లెక్కింపు చేపడుతారని తెలిపారు.

**12 మంది అభ్యర్థులు బరిలో..**

నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల బరిలో 12 మంది అభ్యర్థులు బరిలో నిచారు. బీఆర్ఎస్ నుంచి కాలె యాదయ్య, కాంగ్రెస్ పార్టీ నుంచి పామెన భీం భరత్, బీజేపీ నుంచి కేఎస్ రత్నంతో పాటు పలువురు అభ్యర్థులు బరిలో నిలిచారు. వారి భవితవ్యం ఆదివారం తేలనుంది. ఎవరికి వారు గెలుపుపై ధీమాతో ఉండగా, చేవెళ్ల గడ్డపై మరోమారు గులాబీ జెండా ఎగురనున్నట్లు ఆ పార్టీ శ్రేణులు ధీమాతో ఉన్నారు.

## లెక్కింపునకు పటిష్ట బందోబస్తు

- రాచకొండ సీపీ డీహెచ్ చౌహాన్


భద్రత ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న సీపీ

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 2 : రాచకొండ పోలీసు కమిషనర్‌రేట్ పరిధిలోని కౌంటింగ్ సెంటర్లల్లో ఓట్ల లెక్కింపుకోసం పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశామని రాచకొండ సీపీ డీహెచ్ చౌహాన్ అన్నారు. శనివారం మంగల్‌పల్లి సమీపంలోని సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు జరుగనున్న ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల బందోబస్తును పరిశీలించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగనున్న నేపథ్యంలో రాచకొండ కమిషనర్‌రేట్ పరిధిలోని యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, రంగారెడ్డిజిల్లా పరిధిలోని ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, ఎల్‌బీనగర్, కల్వకుర్తి ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన సిబ్బందితో మాట్లాడారు. రాచకొండ పోలీసులు అనుసరించిన వ్యూహం వలన ఎన్నికలు సజావుగా జరిగాయని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా కూడా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర బలగాలతో పాటు పలు విభాగాల రాచకొండ పోలీసులు నేడు జరుగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ సమయంలో విధుల్లో ఉంటారని తెలిపారు. ఒకొక్క ఓట్లలెక్కింపు కేంద్రం వద్ద సుమారు ఐదువందల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈవీఎంలను భద్రపర్చిన రూంల వద్ద కూడా కేంద్ర బలగలాలతో మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాస్‌లు ఉన్నవారిని మాత్రమే కౌంటింగ్‌కు అనుమతిస్తామని, ఎన్నికల కమిషన్ ఇచ్చిన వారితో పాటు మీడియాను అనుమతిస్తామన్నారు. కౌటింగ్ కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందని అన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎవరు గుమిగూడవద్దని ఆయన సూచించారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి రిటర్నింగ్ అధికారులు, అబ్జర్వర్లతో చర్చించి చేపట్టాల్సిన భద్రతపై ఆయన అడిగి తెలుసుకున్నారు. సీపీ వెంట పలువురు డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## తండ్రి జ్ఞాపకార్థం వైకుంఠ రథం విరాళం


వైకుంఠ రథాన్ని అందజేస్తున్న మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి

చేవెళ్ల రూరల్, డిసెంబర్ 2 : చేవెళ్ల మండల పరిధి పామెన గ్రామంలో మాజీ సర్పంచ్ దావల్ గారి గోపాల్ రెడ్డి తన తండ్రి స్వర్గీయ మాణిక్య రెడ్డి జ్ఞాపకార్థం రూ.4 లక్షలతో వైకుంఠ రథాన్ని శనివారం గ్రామ పంచాయతీకి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి జ్ఞాపకార్థం గ్రామానికి వైకుంఠ రథం అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. మనిషి బతికున్నన్ని రోజుల కంటే చనిపోయినప్పుడు చివరి మజిలీ కార్యక్రమాలకు సహాయపడాలనుకుని వైకుంఠ రథాన్ని గ్రామ ప్రజలకు అందజేశానన్నారు.

## వీరాంజనేయస్వామి ఆలయంలో పూజలు

షాద్‌నగర్‌టౌన్, డిసెంబర్02 : కార్తిక మాసం శనివారాన్ని పురస్కరించుకుని షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చౌడమ్మగుట్ట వీరాంజనేయస్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచే దేవాలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. దేవాలయం ప్రాంగణంలో సత్యనారాయణస్వామి వ్రతాలను చేశారు. దేవాలయ ఆవరణలో స్వామి వారి పల్లకీసేవను జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్ అంటూ భక్తితో నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## బుగ్గ జాతరకు పోటెత్తిన భక్తులు

మంచాల, డిసెంబర్ 2 : మంచాల మండలం ఆరుట్ల గ్రామ సమీపంలో ఉన్న బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయానికి శనివారం కార్తిక స్నానాలను ఆచరించేందుకు భక్తులు ఐదవ రోజు కూడా పోటెత్తారు. స్వామి వారిని దర్శించుకుకొని పూజలు నిర్వహించారు. తులసి కోట వద్ద కార్తిక దీపాలను వెలిగించారు. అనంతరం నాగన్న పుట్ట, కబీర్‌దాస్ మందిరాన్ని దర్శించుకొని కుటుంబ సమేతంగా దేవాలయ సమీపంలో వన భోజనాలను చేశారు.


దేవాలయ ఆవరణలో కార్తిక దీపాలను వెలిగిస్తున్న భక్తులు


శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న భక్తురాలు


బుగ్గరామలింగేశ్వర స్వామి సన్నిధానంలో భక్తుల కిటకిట